# నెరజాణ

సంపుటము 1 | 1936 మార్చి 1 | సంచిక 10



## మా బావమఱది.

అంటే యింటావిడ సహోదరమహాశయుడు. ఈ పెద్దమనిషి మాయింటికి యెప్పుడువస్తాడని నాకు తెలిసినా నాగుండెలు పీచుపీచు మంటాయి. ఒచ్చినవాడుతిన్నగానుండక, నేను అతిమోజుగా కుట్టించుకున్న పొందూరు ఖద్దరు చొక్కాలు, సన్నఖద్దరుపంచెలు స్వంతంవిలా గుపయోగించుకొనటమేకాకుండా వాటినిండా బీడీకాల్పులతో అక్కడ పడేసిపోతాడు. చేసేఉపకారం గడ్డిపరకంత లేదు.

అతని దినచర్యవినండి. ఉదయం నాతోసమానంగా కాఫీ; వగైరాలుపడతాయి. అదిమొదలు భోజనంవేళదాకా ఒకకట్టకరింబీడీలు, ఒకఅగ్గిపెట్టె ముందుపడేసుకుని అరుగుమీద కూర్చుంటాడు. అవిఅంటిస్తూ రోడ్డమ్మటపోయేవాళ్ళందర్నీ పలకరిస్తూంటాడు. సాధారణముగా అతనిచేత పలకరింపబడని వ్యక్తి ఉండడని నాఅభిప్రాయం. ఎందుచేతనంటే నే నెఱగనివాళ్లు కూడా నా దగ్గరకొచ్చి "ఏమండోయి మీభావమరిదిగారు నిన్నరాత్రి సినీమాలో చాలా జోరుచేశారే" అని ఒకరు.

"అయ్యో మొన్న బజార్లో జట్కాబండీవాడినిలెంపకాయకొట్టి ఛార్జీలుదాకావెళ్ళి నాయన మీ భావమరిదిగారాఅండీ" అని మరొకరు "ఏవోయి, మీపానకాలరాయుడుద్దండుడే. మొన్న మీయింటి compound గోడెక్కాడుటే" అని మానుండరం.

అతనున్న వారంపదిరోజులలో మా చిట్టికి రాత్రిళ్లునిద్రఉండదు. ఊళ్ళో రెండు, మూడు సినీమాలుండటంచేత, regular గా పోతారు, వాడూ మేనమామాను. మా భావమరిది వెళ్లిపోయిన మరి నాలుగురోజులకి బయటపడతాయి అతని ముఖ్యమైన చర్యలు.

"ఏమండీ మీ భావమరిదిగారంట మూడు రూపాయిలపావలావోడి, యెగబెట్టిపోయాడు, ఇదేనేటండీపెద్దమనిషితరహా." అంటాడుసిగరెట్ల వర్తకుడు అప్పలసామి.

"ఏంసామీ, మీపేరుచెప్పినాడూ, మీది బావమరిదట, అయిదురూపాదాకావాడినాడు, ఏడండీ" అంటా డయ్యారు.

"అయ్యా! మీభావమరిదిగారు మొన్న మా

కొట్లోకొచ్చి ఒక అయిదుగజాలు కేంబోసిల్కు, రెండు తెల్లమల్లుచాపులు, ఒకరడజను బనియన్లు తీసికెళ్ళారు, లెఖదయచేయిస్తారా?" అని బట్టల వర్తకుడు నెలాఖరున డిమేండు.

ఇత్యాదులింకా కొన్నివున్నాయి నా నెత్తిన బడేవి.

ఆ దినం మామూలుప్రకారం టిఫిను టయిముకి బయటికొచ్చిరాగానే అందించాడు పోస్టు జవాను శ్రీముఖం. ఇక నొకవారం రోజుల్లో వస్తున్నానని లిఖించారు మా భావమఱదిగారు. ఆ రోజుకు పని ఆటోమేటిక్ గా ఆగిపోయింది. మిగిలిన గంటలు యెలాగడిచాయో కలమాత్మకెఱుక. ఇంటికొచ్చి బట్టలు విప్పుతూ పొరపాటు నాఉత్తరం నేలనేసికొట్టాను. ఆ వుత్తరం చదవబడగానే, certain lecture ప్రారంభమైనది.

"పోనీ అంతకష్టంగావుంటే రావొద్దని రాస్తానంటెండి అప్పను అయినకాడికి మూడువేల రూపాయిల మూటా గుమ్మరించుకోవటం తెలును. ముచ్చటకని ఒకవారంరోజు లుంటానంటే యేకరుసరునలు, పండక్కి తీసికెళ్ళలేదనీ, వాచీగొలుసు పెట్టలేదనీ వంకలుచెప్పి డబ్బుగుంజడం చేతనవును. మీరు వాడొచ్చినప్పుడు పట్టుమని ఒకపండలపాక చాపైనాపెట్టారా? మొన్న మీపింతల్లి కొడుకొచ్చాడనగానే, ఆ వెధవమొహానికి యెక్కడలేని వేపుళ్లూ, కూరలూను...... నోటిదాకా దిక్కుమాల మర్యాదలే. పైగా జామార్లు బహుమతులు, మావాళ్ళనేనరికల్లా కంట్లో ఖారం కొట్టుకుంటారు, అదేం పాపమో గాని......"

ఈ సందర్భంలో జవాబు యేంచెప్పినా ద్వితీయాస్త్రం ప్రయోగింపబడటమో, లేక అగ్గిమీద గుగ్గిలంవేసినట్టు జరగడమో అవుతుంది అనుకుని తిరిగి సమాధానంచెప్పకుండా కండువా పైమీద వేసుకుని బైటపడ్డా.

మరి పదిరోజులు పోయాక మా భావమఱది వొచ్చాడు. ఇదివరలో పనులన్నీ జరిగినప్పటికీ యీమారొచ్చినప్పుడు మహోత్కృష్టమైన ఉపకారాలు రెండుచేసి మరీవెళ్ళాడు. అది కొంచెం టూకీగా చెప్పి ముగించుతా.

నెలకొచ్చే రాబడిలో సగం Crossword Pazzles క్రింద తగలేసే మహానుభావుల్లో నేనొకడిని. ఒకరోజున ఒక Pazzle solve చేసి గ్రామాంతరం వెళ్ళవలసొచ్చి entrance fee మా భావమఱది చేతికిచ్చి తగిన యేర్పాట్లు చెయ్యమన్నా. నేను పోయి మర్నాడొచ్చా. Entrance fee గొడవ మరిచిపోయా. కాని యింట్లో మాత్రం రెండుమూడు కొత్తచీరెలు కనబడ్డాయి.

"ఇవెక్కడివి" అని అడిగా.

"మనకొచ్చే రాబడి తక్కువ. పైగా సగం డబ్బు దిక్కుమాలిన Pazzles కి తగలేస్తారు. ఒకాదమ్మిడీ తిరిగిరాదు. ఏ ఖర్చు తప్పుతుందీ కట్టుకుందామంటే శుభ్రమైన కోక ఒకటీలేదు. మరేమన్నానసరే అని నిన్న మీరు కట్టమన్న యెనిమిదిరూపాయిలూపెట్టి యీమూడుచీరెలు మా తమ్ముడుచేత తెప్పించుకున్నాను. చూడండెంతందంగావున్నాయోను".

ఆ చీరెలు చూచేసరికి నాకు ముచ్చటేసింది. Cross word Puzzles మీద విరక్తి పుట్టింది. అది లగాయితు నెలకి Savings Bank లో కొంతడబ్బు వడేస్తున్నాను.

మా యింటిప్రక్కనున్న లంబోదరావధాన్లుగారికి అయిదేళ్ళ గారాబుకొడుకున్నాడు.

అరుగుమీద కూర్చుని రోడ్డమ్మట యెవరినీ వెళ్ళనివ్వడు. ఎంతటిజమీందారైనా, అధికారైనా వాడు తిటే బూతులు పడవలసిందే. ఎవరేనా వెళ్లి "అవధాన్లుగారూ, మీవాడు చూడండీ" అంటే

"ఏదో బాబూ చిన్నతనంనుంచీ అలవాటైంది. మా యింట్లో వాళ్ళనీ తిడతాడు. చిన్నతనం కాదండీ" అని ఆ పెద్దమనిషి సమాధానం.

ఒకరోజున మా భావమరిది వెళుతూంటే అతనికీ తగిలాయి, అవధాన్లుగారిబ్బాయి చేత ఆశీర్వచనాలు. అతని వొళ్లుమండిపోయింది. కుర్రాడిని చెయ్యిచేసుకుంటే బాగుండదనుకున్నాడు. తిన్నగా యింటికొచ్చినా Walking stick తీసి మా చిట్టికిచ్చి అవధాన్లుగారి కొడుకుని చచ్చేలాకొట్టి పరుగెత్తుకురమ్మన్నాడు. మేనమామకంటె రెండాకులెక్కువ చదువుకున్నవాడు మావాడు. అవధాన్లుకొడుకుని చచ్చేలా కొట్టి అరుగుమీదనుంచి తోశేశాడు. ఆకుర్రాడిమూతి బద్దలయి నెత్తురుకారటం ప్రారంభించింది. అవధాన్లొచ్చేలోపున చిట్టి మా యింటికి పరుగెత్తుకొచ్చేశాడు.

ఏమీ యెరగనట్టు మా భావమరిది కాలుమీద కాలువేసుకుని బీడీకాలుస్తున్నాడు. కొడుకుని వెంటేసుకుని అవధాన్లొచ్చాడు. అతన్ని చూచి మావాడు "ఓహో అవధాన్లుగారా దయచెయ్యండి" అని లోపలికివెళ్లి కుర్చీఒకటి తెచ్చివేశాడు. అవధాన్లు కూర్చోలేదు.

"చూడండి మీ మేనల్లుడు మావాడిని, చేతికర్రతో కొట్టి అరుగుమీదనుంచి తోశేశాడు" అన్నాడు.

"అదేనండీ చచ్చిపోతున్నాం. ఇవాళా కాదూ, అలాగే ఆ చేతికర్రతో వాళ్ళమ్మని చచ్చేలా కొట్టాడు. చిన్నప్పట్నుంచీ దిక్కుమాలలవాటైపోయింది. పైగా ఆకర్రి వకటు" అని సమాధానం చెప్పాడు. అతి serious గా, ముక్కులోంచి బీడీపొగ వొదుల్తూను.

అవధాన్లు మొహంమీద కత్తేస్తే నెత్తురు చుక్కలేదు. తిరిగి మాట్లాడకుండా యింటికి పోయాడు. ఆదెబ్బతోటి అవధాన్లుకొడుకు అరుగుమీద కూర్చుని అందరినీ తిట్టడం మానేశాడు. ఇంతటి మహోపకారంచేశ్ని మా భావమరిదిని పొగుడుతూ నన్ను thank చెయ్యటం మొదలెట్టారు మావీధినున్న ప్లీడర్లూ, డాక్టర్లూ మొదలైనవాళ్లు.

—పి. వి. సత్యనారాయణమూర్తి రాజు.

---

# "ఎందుకు నవ్వుతారు నన్ను చూస్తే"

నేనంటే అందరు నవ్వుతారు కారణం తెలియదు. పైపెచ్చు నన్ను "రామం అని మూడక్షరాల పేరుతో పిలుస్తారు వీళ్ళదుంపతెగ. అసలేనా పేరు సాక్షాత్తు ఆభగవంతుని పేరైనా, శ్రీరామచంద్రమూర్తి. ఇంతపేరు ఉండగా చటుక్కున పదిమంది పెద్దాళ్ళలోఉంటే రామమూ! అని పిలచేటప్పటికి చాలా! కోపంవస్తుంది కాని దొరకదు. నేను వేదశాస్త్రపురాణేతిహాసాలు పూర్తిగా చదివేశాను నేనింత పండితుడని తెలియక, ఏవో రెండు? ఇంగ్లీషుముక్కలు